# క్షామగీతం



ఆంధ్రభూమి వీక్లీ, 11 డిసెంబర్, 2003

"మావయ్యా! బాబు పాలకోసం ఏడుస్తున్నాడు. వంటవాళ్ళు పాలు ఇంకా రాలేదంటున్నారు. ఊర్లో ఎక్కడైనా ఓ గ్లాసెడు పాలు దొరుకుతాయా?" శశికళ మేనమామ గోపాలాన్ని అడిగింది.

"కరువు వల్ల ఊర్లో పాడి అన్నమాటే లేకుండా పోయిందమ్మా! పట్నం నుంచి డైరీ పాలు తెమ్మని జీపు పంపించాను. వాళ్ళు ఈపాటికి వస్తూ ఉండాలి. అయినా పాలేరుని పంపించి ఊర్లో ఎవరింట్లోనైనా పాలు ఉన్నాయేమో కనుక్కోమంటాను" అన్నాడు గోపాలం- గుక్క పట్టి ఏడుస్తున్న మేనకోడలి బిడ్డను చూస్తూ.

మేనమామ కూతురి పెళ్ళికి ఆ పల్లెటూరు వచ్చింది శశికళ. 'ఆఫీసులో పని ఉంది కనుక పెళ్ళికి వెళ్లలేం' అని చెప్పిన భర్త ముందురోజు సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే ఊరికి బయలుదేరదామని చెప్పడంతో– ఆ హడావిడిలో బాబు పాలడబ్బా తీసుకురావడం మరచిపోయింది.

ఎంతసేపటికీ పట్నం నుంచి పాలు రాలేదు.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లసాగాడు శశికళ కొడుకు. ఇంతలో... విషయం విన్న ఆమె మేనమామ భార్య ఆమెకు ఒక సలహా ఇచ్చింది. పెళ్ళికి వచ్చిన తన స్నేహితురాలి కూతురు బాలింత అనీ, బాబుకు ఆమెచే పాలు పట్టించమని!

శశికళ ఏడాది బాబు పాల సమస్య ఆ విధంగా తీరింది. ఆ అమ్మాయికి కృతజ్ఞతలు చెప్పుకుని, బాబుని ఎత్తుకుని భర్త దగ్గరకు వచ్చింది శశికళ. ఏడుపు ఆపి, నవ్వుతూ కేరింతలు కొడుతున్న కొడుకుని చూసి ఆశ్చర్యపోయాడు శశికళ భర్త సురేష్. జరిగింది భర్తకు చెప్పింది.

"థాంక్ గాడ్!" అన్నాడు సురేష్.

పెళ్ళితంతు అయ్యాక భోజనాలు పూర్తికానిచ్చుకుని ఊరికి బయలుదేరడానికి సిద్ధమైంది శశికళ. మేనమామ భార్య ఇచ్చిన తాంబూలం తీసుకుని వస్తూ... ఎదురుగా కనిపించిన ఆ అమ్మాయిని చూసి, "మేం ఊరికి బయలుదేరుతున్నామండీ! మీకు చాలా థాంక్స్! మంచి సమయానికి సాయం చేశారు" అంది.

"అదేం పెద్ద సాయంలెండి! మనిషికి మనిషి ఆమాత్రం సహాయం చేయకపోతే ఎలా? బాబు ఏడీ?" అని అడిగింది ఆ అమ్మాయి.

"అదిగో... వాళ్ళ డాడీ దగ్గర ఉన్నాడు. ఆయన మావారు... బ్యాంకులో పనిచేస్తారు!" అంటూ దూరంగా కూర్చునివున్న భర్తను చూపింది శశికళ.

అందంగా, ఆకర్షణీయంగా కనబడుతున్న అతన్ని చూసి, 'ఇతన్ని ఎక్కడో చూసినట్టుంది...' అనుకుంటూ ఆలోచిస్తున్న ఆ అమ్మాయికి కొద్దిక్షణాల తర్వాత గుర్తొచ్చింది– అతన్ని ఎక్కడ చూసిందో! ఆరోజు అతని మాటలు తలచుకోగానే ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులూ పాకినట్లనిపించింది ఆమెకు.

నెలరోజుల క్రితం బ్యాంకులో పనిబడి తల్లితో వెళ్లింది తను. తన తండ్రి చనిపోవడంతో ఆయన పేరుతో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు తల్లిపేరు మీద మార్చడానికి– ఆయన వారసురాలిగా తాను సంతకం పెట్టాలని బ్యాంకు ఆఫీసర్ చెప్పడంతో వెళ్లింది.

తన భర్త మిలటరీ ఉద్యోగం చేస్తూ దేశ సరిహద్దుల్లో ఉన్నందువల్ల, తోబుట్టువులెవరూ లేనందువల్ల– చేతిలో బిడ్డతో తనూ, తల్లీ వెళ్లారు.

ఆరోజు బ్యాంకులో రష్ ఎక్కువగా ఉంది. తమను రమ్మని చెప్పిన ఆఫీసర్ తమ సంగతి పట్టించుకునే స్థితిలో లేడు. అతని చుట్టూ జనం ఉన్నారు. అయితే తమ పని అంత త్వరగా అయ్యేది కాదని, కాస్త ఆలస్యమవుతుందని ముందే చెప్పాడు ఆయన.

తామిద్దరూ కూర్చొనివున్న బెంచీకి దగ్గరున్న ఓ సీటులో కూర్చుని ఉన్నాడు... 'అతను.'

పని చేసుకుంటూ, అప్పుడప్పుడూ తనవైపు చూసి వెకిలినవ్వులు నవ్వుతున్నాడు. కళ్ళతోనే తినేసేలా చూస్తున్నాడు. 'భగవంతుడు ఈ మనిషికి అందం ఇచ్చాడుగాని, మనసుకి అందం ఇవ్వలేదు' అనుకుంది.

ఇంతలో... చేతిలోని బిడ్డ ఏడవసాగింది.

అప్పుడు గుర్తొచ్చింది... పాపకు పాలు పట్టి చాలాసేపైందని!

దూరంగా వెళ్లి పాలు పడదామని చూస్తే ఎక్కడా ఖాళీస్థలం కనిపించలేదు. పాప ఏడుపు ఎక్కువై, అక్కడున్న అందరూ విసుగ్గా తనవైపు చూడసాగారు. ఇక వేరే దారి లేక అక్కడే పైట చాటుగా చేసుకొని పాలు పట్టసాగింది.

అప్పుడే అతని దగ్గరకు ఓ వ్యక్తి వచ్చి నిలబడ్డాడు. వాళ్ళ మాటల్ని బట్టి 'అతనూ ఆ బ్యాంకులో పనిచేసే ఉద్యోగే' అని అర్థమైంది తనకు. తనవైపు వెకిలిచూపులు చూస్తున్నతని పేరు సురేష్ అనికూడా తెలిసింది.

"పద... బయటి కెళ్లి టీ త్రాగివద్దాం!" అన్నాడు అక్కడికి వచ్చినతను.

"నేను టీ త్రాగను. పాలు మాత్రమే త్రాగుతాను" అన్నాడు సురేష్ తనవైపే చూస్తూ.

"నువ్వు పాలు త్రాగు. నేను టీ త్రాగుతాను"

"నాకు ఫ్రెష్‌గా ఉండే పాలు కావాలి!" అంటూ తనవైపు చూసి నవ్వాడు అతను.

సిగ్గుతో చచ్చిపోవాలనిపించింది తనకు. మనుషులు ఇంత సంస్కార రహితంగా ఉంటారని తనకు తెలియదు. మగవాళ్ళు ఆడపిల్లల్ని కామెంట్ చేయడం, ఏడిపించడమే తనకు తెలుసు. ఓ ఆడపిల్లగా అవి తనకూ ఎదురయ్యాయి. కాని, మగవాడికి- బిడ్డకు పాలిచ్చే ఆడదానిలో ఓ తల్లే కనబడుతుందని తను భావించింది. కాని, ఇలా అసభ్యకరమైన ఆలోచనలు, మాటలు కూడా వస్తాయని తనకు ఈరోజే తెలిసింది.

ఇటువంటి సమయాలలో భర్త ప్రక్కన లేకపోవడం ఎంత లోటో అనిపించింది. ప్రక్కనే తల్లి ఉన్నా... భర్త పోయిన బాధలో ఆమె ఉంది. 'ఒంటరి ఆడదానికి శారీరకంగానే కాదు.., మానసికంగా కూడా రక్షణ లేదు' ...అనుకుంది. ఆ తర్వాత అతను అన్న మాటల్ని తలచుకుని మూడురోజులు బాధపడింది.

"హలో అంజలిగారూ.... ఏమిటి ఆలోచిస్తున్నారు? ఈయన మావారు సురేష్!" అంటూ భర్తను పరిచయం చేసింది శశికళ.

ఆమెను చూసిన సురేష్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తను ఆమెతో వెకిలిగా ప్రవర్తించినా, అసభ్యంగా మాట్లాడినా తన బిడ్డకు పాలిచ్చి ఎంతో ఉపకారం చేసిన ఆమెలో ఓ 'అమ్మ' కనిపించింది అతనికి ఈసారి. రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు దీనంగా ఆమెవైపే చూస్తూ.

ఆ చూపులో ఎన్నో అర్థాలు కనిపించాయి ఆమెకి. చేసిన సహాయానికి ధన్యవాదాలు చెప్పడంతో పాటు 'తన తప్పు క్షమించమన్న అభ్యర్థన, తన ప్రవర్తన గురించి తన భార్యకు చెప్పవద్దన్న వేడుకోలు, ఇంకెప్పుడూ ఎవరితోనూ అలా ప్రవర్తించను' అన్న హామీ అతని చూపులో కనిపించి- నవ్వుతూ తనూ ప్రతి నమస్కారం చేసింది.

ఎంతైనా... ఆమె ఆడది! క్షమాగుణం ఆమె ఆస్తి!!